బాల్య వివాహాలు అరికడదాం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ తారాసింగ్

బల్మూర్: బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, చిన్నారుల అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ తారాసింగ్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కై లాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సౌజన్యంతో కోనేరు సంస్థ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 18 ఏళ్లలోపు బాలికలకు 21 ఏళ్ల లోపు బాలురకు వివాహాలు చేయడం చట్టవిరుద్ధమన్నారు. కిశోర బాలికల ఎదుగుదలపై ఆరోగ్య శాఖ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. ఎవరైనా లైంగిక వేధిస్తే 100 లేదా 1098 చైల్డ్ లైన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ దమయంతి, ఎంపీడీఓ రాఘవులు, ఆర్ఐ పద్మ, హెచ్ఎం నరేందర్‌రెడ్డి, ఫార్మసిస్ట్ శ్రీనువాసులు, కోనేరు సంస్థ కోఆర్డినేటరు ఆంజనేయులు, షీటీం హెడ్ కానిస్టేబుల్ పద్మ, ఆరోగ్య, ఐసీడీఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న విజయలక్ష్మి

కొల్లాపూర్: బాలికలను, మహిళలను లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా షీటీమ్ ఇన్‌చార్జ్ విజయలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో లైంగిక వేధింపులు అనే అంశంపై గ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి జిల్లాలోని లైన్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో వేధింపులకు గురయ్యే మహిళలు 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా పరిరక్షణ అధికారి శ్రీశైలం, ఎంఈఓ ఇమ్మాన్యుయేల్, బాలల సంక్షేమ సమితి సభ్యులు విష్ణు, సఖి అడ్మిన్ సునీత, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనియస్ తదితరులు ఉన్నారు.

'అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తప్పించాలి'


నాగర్‌కర్నూల్‌లో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం బాల్‌నర్సింహ డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం అంబేడ్కర్ చౌక్ వద్ద అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఉప్పునుంతల మండల కేంద్రంలోని స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ నాయకులు ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. కల్వకుర్తి మండలం మహబూబ్‌నగర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీపీఎం నాయకలు ఆందోళన నిర్వహించారు. పెద్దకొత్తపల్లి, వెల్దండలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. పెంట్లవెల్లిలో మంత్రిపదవి నుంచి బర్తరఫ్ చేయాలని మాలమహానాడు రాష్ట్ర నాయకులు గోవురాజు డిమాండ్ చేశారు. తాడూరులో మాల మహానాడు నాయకులు కేంద్ర మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. తెలికపల్లిలో శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ మాలల చైతన్యసమితి నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

ఆటో డ్రైవర్ల ముందస్తు అరెస్టు తగదు


కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్ లో ఆటోడ్రైవర్లు

కొల్లాపూర్: ప్రజాపాలన భవన్ ముట్టడికి వెళ్తారనే సమాచారంతో పట్టణంలోని ఆటోడ్రైవర్లను, కార్మిక సంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కారణంగా ఆటోడ్రైవర్లు జీవనోపాధిని కోల్పోయారని ఆటో యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఆత్మహత్య చేసుకున్న ఆటోడ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. అరెస్ట్ అయిన వారిలో శివవర్మ, యూసూఫ్, దామోదర్, కురుమయ్య, శంకర్, సలీం, రాజు తదితరులు ఉన్నారు.

తాడూరు: ఏఐటీయూసీ తెలంగాణ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా శుక్రవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఆటో కార్మికులకు రూ.12 వేలు అమలు చేయాలని అమలు చేయాలని కోరారు.

పత్తి కొనుగోలులో ఇబ్బందులు పెట్టొద్దు



తాడూరు: పత్తి కొనుగోలులో ఇబ్బందులు పెట్టొద్దని ఆర్ఐ సల్మాన్ కోరారు. శుక్రవారం మండలంలోని ఇంద్రకల్ రోడ్డుకు అనుసరించుకొని ఉన్న మణికంఠ ఇండస్ట్రీ పత్తి మిల్లు నిర్వాహకులు మద్దతు ధర సరిగ్గా ఇవ్వడం లేదని ఇంటర్నేషనల్ హ్యూమెన్‌రైట్స్ జిల్లా అధ్యక్షుడు బాలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా ఆర్ఐ సల్మాన్ కొనుగోలు కేంద్రానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. పత్తి మిల్లును పరిశీలించిన ఆర్ఐకు రైతుల ఇబ్బందుల గురించి వివరించారు. పత్తి కొనుగోలు వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు వీరారెడ్డి, నాగేష్, భీమయ్య, రాజు, జంగయ్యలు వివరించారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

కల్వకుర్తిరూరల్: అర్హులందరికీ రుణమాఫీ చేయాలని రైతు సంఘం నాయకుడు బండెల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కల్వకుర్తి మార్కెట్‌యార్డ్‌లో రైతులతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. దాదాపు 50 శాతం మంది రైతులకు మాత్రమే రూ.2 లక్షల రుణమాఫీ అయ్యిందన్నారు. వెల్దండ, కల్వకుర్తి, వంగూరు, ఊరుకొండ మండలాలకు చెందిన రైతులు వెంకటయ్య, రామకృష్ణారెడ్డి, శ్రీను, తలసాని కృష్ణారెడ్డి, యాదగిరిరెడ్డి, తిరుపతిరెడ్డి పలువురు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాది గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు.సన్న, దొడ్డు రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అశోక్, బి శివ వర్మ, తారసింగ్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

కొల్లాపూర్: వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ ఉద్యోగి మౌలాలికి మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు శేఖర్, కార్యదర్శి వెంకటరమణ, నాయకులు కృష్ణప్రసాద్, భగవాన్, రాము, రఘువీర్‌గౌడ్, శ్రీకాంత్, అఖిల్, చంద్రకళ, గోవిందమ్మ, మున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి రిమాండ్

తిమ్మాజిపేట: ఇద్దరు పోలీసు కానిస్టేబుల్స్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల7వ తేదీ గుమ్మకొండ సమీపంలో భారత్ పెట్రోల్ బంకు వద్ద ఆటో బోల్తా పడడంతో అక్కడికి వెళ్లిన పోలీస్ కానిస్టేబుల్స్ శరత్‌గౌడ్, రఘునందన్‌ల విధులకు ఆటో డ్రైవర్ బావాజీపల్లి నాగయ్య ఆటంకం కలిగించారు. కానిస్టేబుల్ శరత్‌గౌడ్‌ను కింద తోసివేసి కిందపడేశాడు. ఈ ఘటనలో నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలోని ఆవంచలో చికెన్ ఇవ్వలేదన్న కోపంతో యాదగిరిపై దాడిచేసిన శేఖర్, శ్రీనులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గురుకుల పాఠశాలలో 'వాయిస్ ఫర్ గర్ల్స్'

మన్ననూర్: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (బాలికలు)లో ఎన్జీఓ వారి సహకారంతో 'వాయిస్ ఫర్ గర్ల్స్' అనే సోషల్ ఆక్టివిటీస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పది రోజుల పాలు కార్యక్రమం కొనసాగనుంది. శుక్రవారం యుక్త వయస్సులో బాలికలకు స్వేచ్ఛ, జీవన నైపుణ్యాలు, సాధికారత, కమ్యూనికేషన్స్ తదితర అంశాల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ రూపాదేవి మాట్లాడుతూ వాయిస్ ఫర్ గర్ల్స్ పరిచయ వేదిక ఈ నెల 22వ తేదీ వరకు కొనసాగుతుందని అన్నారు. ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్దండ: మండల కేంద్రంతో పాటు పెద్దాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఏ సూర్యంనాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల పనులు చేపడుతుండటంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

ధ్యానంపై అవగాహన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని కుడికిల్ల ఉన్నత పాఠశాలలో యోగా గురువు శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ధ్యానం, యోగాపై అవగాహన కల్పించారు. ఈ నెల 21న ప్రపంచ మెడిటేషన్ డే ను పురస్కరించుకొని విద్యార్థులకు ఆసనాలు వేయించారు. యోగాతో కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి శుక్రవారం ఉప్పునుంతల మండలం దాసర్లపల్లికి చెందిన గంగుల నర్సింహారెడ్డి, కవిత దంపతులు రూ. 25116లు విరాళంగా అందజేశారు. దాతను ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు, ఆలయ పూజారులు సన్మానించారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు గౌతంరెడ్డి, అర్చన, వరుణ్‌రెడ్డి, సుష్మారెడ్డి పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ ఏకగ్రీవం



మన్ననూర్: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం ప్రాంగణంలో ఉమామహేశ్వర ప్రభ ఉత్సవ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండపల్లి మల్లేష్, ఉపాధ్యక్షుడిగా తోటపల్లి రమేష్‌లు ఎన్నికయ్యారు. గౌరవ సలహా సభ్యులుగా పుల్జాల శేఖర్, సరస్వతి, బాలకృష్ణ, సురేష్, శరణ్, మల్లాజీ, శేఖర్, శ్రీకాంత్‌లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారిని సన్మానించారు. అనంతరం అధ్యక్షుడు మల్లేష్ మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో ప్రభోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహిస్తామన్నారు.

విశ్రాంత తహసీల్దార్‌కు కలెక్టర్ నివాళి

నాగర్‌కర్నూల్: పట్టణంలో విశ్రాంత తహసీల్దార్ రామకృష్ణ చారి శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ బదావత్ సంతోష్ బాధిత కుటుంబానికి పరామర్శించారు. రామకృష్ణ చారి మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కే సీతారామారావు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, కలెక్టరేట్ అధికారులు ఉన్నారు.

డీఎంహెచ్‌ఓకు వినతి



నాగర్‌కర్నూల్‌రూరల్: వైద్య రంగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు ప్రభుత్వం నిర్వహించిన రాత పరీక్షలు రద్దు చేసి ప్రస్తుతం విధుల్లో ఉన్న ఏఎన్ఎంలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఎన్ఎం జేఏసీ నాయకురాలు సుగణ, పర్వీనా డిమాండ్ చేశారు. శుక్రవారం డీఎంఅండ్‌హెచ్ఓ స్వరాజ్యలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. రూ.27 వేల వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, శివాణి, మంజుల, కృష్ణవేణి, అరుణ, హైమావతి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



తైక్వాందో కోచ్‌లతో మెడల్స్ సాధించిన విద్యార్థులు

కొల్లాపూర్: ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కల్వకుర్తిలో నిర్వహించిన ఈ పోటీల్లో సింగోటం గ్రామానికి చెందిన నాగరాజు గోల్డ్‌మెడల్, కొల్లాపూర్‌కు చెందిన అజిత్, మొలచింతపల్లికి చెందిన శ్రావణి, చింతలపల్లి గ్రామానికి చెందిన నందిని, ప్రశాంతి, అంకితలు సిల్వర్ మెడల్ సాధించారు. చింతలపల్లికి చెందిన ప్రవీణ్, భానుప్రకాష్, మహేశ్వరీ, ఐశ్వర్య, ఎన్మన్‌బెట్లకు చెందిన శ్రావణి బ్రాంజ్ మెడల్స్ సాధించారు. వీరిని తైక్వాండో కోచ్‌లు భాస్కర్‌యాదవ్, ఉపేంద్ర, రవీందర్, మల్లేష్, మాస్టర్ శరబందరాజులు అభినందించారు. గోల్డ్‌మెడల్ సాధించిన నాగరాజు ఈనెల 31 నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్‌లు తెలిపారు.

నాగర్‌కర్నూల్: కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా తైక్వాండో పోటీల్లో నాగర్‌కర్నూల్‌కు చెందిన విగ్నేష్ గోల్డ్‌మెడల్ సాధించాడు. సీఎం కప్ రాష్ట్ర తైక్వాండో పోటీలకు ఎంపికయ్యాడు. కార్యక్రమంలో డీవైఎస్ఓ సీతారాంనాయక్, తైక్వాండో జిల్లా జనరల్ సెక్రెటరీ బాబుల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థి

పెద్దకొత్తపల్లి: పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో డిస్కస్‌త్రో విభాగంలో టి శేఖర్ ద్వితీయ స్థానం నిలిచారు. విద్యార్థి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాసారెడ్డి, పీడీ బాలు తెలిపారు. 31న వరంగల్ హనుమకొండలో జరిగే సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలలో శేఖర్ పాల్గొంటాడని వారు తెలిపారు.

ఎమ్మెల్యే కసిరెడ్డికి చిత్రపటానికి పాలాభిషేకం

చారకొండ: డిండి లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణంలో భాగంగా మండలంలోని గోకారం చెరువును గత ప్రభుత్వం ధ్వంసం చేయడంతో రైతులు నష్టపోయారని శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రస్తావించారు. డీఎల్ఐ నిర్మాణంలో భాగంగా రిజర్వాయర్‌ను పునర్నిర్మాణం, ముంపు గ్రామాల ఆర్ఎన్ఆర్ ప్యాకేజీ, లేదా రిజర్వాయర్ ఎత్తు తగ్గించాలని తదితర వాటిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మండలంలోని ఎర్రవల్లి, ఎర్రవల్లి తండా ప్రజలు, నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చిత్రాపటానికి పాలాభిషేకం చేశారు. సూగురి శ్రీను, అంజనేయులు, రామచంద్రయ్య, బాల్‌రాం, ప్రకాశ్, సంజీవ్, రైతులు బాలయ్య, చంద్రయ్య, మున్నావత్ బిక్కు, లాలు, సూరి తదితరులు మహిళలు, గ్రామస్తులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

దోమలపెంట: భూగర్భ కేంద్రంలో ఆపరేషన్ అండ్ మెయిన్‌టెయిన్‌నెన్స్ విభాగంలో పని చేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కేంద్రం ఎస్ఈ(ఓఅండ్ఎం) ఆదినారాయణకు జెన్‌కో 1535 యూనియన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సుంకరి లవకుమార్ వినతిపత్రం అందజేశారు. కేంద్రంలో పని చేస్తున్న ఆర్టీజియన్లలో నైపుణ్యం ఉన్న వారిని గుర్తించాలని కోరారు. ప్రతి బ్యాచ్‌లో ముగ్గురు మాత్రమే రీడ్ అండ్ రైట్ వ్యక్తులు ఉన్నారని వారిపై పనిభారం ఎక్కువగా ఉందని వివరించారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

లింగాల: శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లింగాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు గణిత బోధ నమేళ, క్విజ్, ఉపన్యాసం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొండయ్య, శంకరయ్య, శేఖర్, మహేశ్వరి, వెంకటేశ్వరశర్మ, రామచంద్రయ్య, నరసింహులు, పురుషోత్తం, రమేష్, ధరమ్‌సింగ్, సురేష్, శివ, శ్రవణ్‌కుమార్, యాదమ్మ, సుజాత, చంద్రకళ పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

మన్ననూర్: ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధమైన ఘటన నల్లమల అటవీ ప్రాంతం అమ్రాబాద్ మండలంలోని మల్లాపూర్ చెంచు పెంటలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పెంటకు చెందిన చిర్ర ముత్తమ్మకు సంబంధించిన పూరి గుడిసె ప్రమాదవశాత్తు అంటుకొని మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. సీబీఎం ట్రస్టు చైర్మన్, అమ్రాబాద్ మండల మాజీ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ శుక్రవారం పెంటను సందర్శించి దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేశారు.

ట్యాంకు వితరణ

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థ దాతలు వాస రాఘవేందర్, గందం వేంకటేష్‌లు శుక్రవారం నీళ్ల ట్యాంకును అందజేశారు. ఎంఈఓ రఘునందన్‌రావు, విద్యార్థులు ఉన్నారు.

ధనుర్మాస ప్రత్యేక పూజలు



కందనూలు: జిల్లా కేంద్రంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం ధనుర్మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, తిరుప్పావై, భజనలు పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపాకటాక్షం పొందాలని ఆలయ పూజారి శ్రీకాంతాచార్యులు కోరారు.

పాలెంలో..

బిజినేపల్లి: మండలంలోని పాలెం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనర్మాస ప్రత్యేక పూజలు ప్రారంభించారు. శుక్రవారం ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు కురవి రామానుజాచార్యులు గోదా అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, మహా మంగళ హారతి, వేదమంత్రోచ్చారణల మధ్య కొనసాగాయి. స్వామివారికి తెల్లవారుజామున సుప్రభాత సేవ తిరుప్పావై సేవ నిర్వహించారు.

వెంకట్‌రెడ్డి సేవలు మరువలేనివి

కల్వకుర్తిరూరల్: ఉమ్మడి జిల్లా యూటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీపీఎం నాయకుడు వెంకట్‌రెడ్డి సేవలు మరువలేనివని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మార్చాల గ్రామంలో 5వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. నాయకులు ఆంజనేయులు, మల్లయ్య, పరశురాములు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే చేపట్టాలి



కల్వకుర్తి టౌన్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు కోసం చేపడుతున్న సర్వేను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ కోరారు. శుక్రవారం పట్టణంలో సర్వేను ఆయన పరిశీలించారు. ఆన్‌లైన్ నమోదులో సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ నెల 30వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు.


సర్వేను పరిశీలించిన ఎంపీడీఓ

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ బ్రహ్మచారి ఆయా పంచాయతీ కార్యదర్శులను సూచించారు.

తెలకపల్లిలో..

తెలకపల్లి: మండల కేంద్రంలో గ్రామపంచాయతీ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. సర్వేలో ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు, ఈఓ భాస్కర్, ప్రవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన మెనూపై నిర్లక్ష్యం వహించొద్దు


మాట్లాడుతున్న ఎంపీడీఓ రాఘవులు

బల్మూర్: నూతన మెనూపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ రాఘవులు హెచ్చరించారు. మండలంలోని చెంచుగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం సిద్ధం చేసిన భోజనం, కూరలతో పాటు బియ్యం, కూరగాయలు, సామగ్రిని పరిశీలించారు. వంటగది శుభ్రంగా ఉంచాలని సూచించారు. గేట్ వద్ద వాచ్ మెన్‌ను ఉంచి లోనికి అపరిచితులను రాకుండా చూడాలని కోరారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి ఆయన తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ఆదివారం మటన్ పెట్టడం లేదని, గుడ్డుకు బదులు అరటి పండు ఇస్తున్నారని విద్యార్థులు వివరించారు. బాత్‌రూంల డోర్లు సక్రమంగా లేవని వాపోయారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం మనెమ్మకు ఆయన సూచించారు.

చట్టపరంగా చర్యలు తీసుకోవాలి

అచ్చంపేట రూరల్: మైదాన ప్రాంత గిరిజనులు ఏజెన్సీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిని తొలగించాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ మాధవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ...ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలో బోనఫైడ్ ఇచ్చిన ప్రధానోపాధ్యాయులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం తాలూకా కార్యదర్శి దగ్గ నాయక్, గిరిజన నాయకులు లక్ష్మణ్, బాలు, వెంకట్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా సెమీక్రిస్మస్



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది కేక్ కట్‌చేశారు. పండుగ విశిష్టతను గురించి వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శివరాం, వైద్యులు యశోదాభాయి, రాములు, నర్సింగ్ సిబ్బంది, ఆస్పత్రి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మన్ననూర్: నల్లమల లోతట్టు అటవీ ప్రాంతం మల్లాపూర్ చెంచు పెంటలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సీబీఎం ట్రస్టు చైర్మన్, అమ్రాబాద్ మండలం మాజీ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ చెంచులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పెంటలోని మహిళలకు చీరలు, చిన్నారులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. నాయకులు సంబు శోభ, ప్రణీత, సుజాత, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, మేరాజ్, రేణయ్య, బాబ, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని వినతి

పెంట్లవెల్లి: గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు వెంటనే పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ వెంకటయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వెట్టి చాకిరి చేస్తూ దుర్భర జీవితం గడుపుతున్న కార్మికులకు వేతనాలు పెంచకుండా, ప్రతి నెల జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో హనుమంతు, బాలరాజు, దేవమ్మ, రజిత, లక్ష్మి పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ

వెల్దండ: మండలంలోని గాన్‌గట్టుతండాకు చెందిన శ్రేయస్సీకి సీఎం రిలీఫ్‌ఫండ్ రూ.51 వేలు మంజూరయ్యారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి శుక్రవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాదులోని ఆయన నివాసంలో చెక్కు అందజేశారు. నాయకులు సతీష్, శివ, యాదగిరి, సాయి ఉన్నారు.

సామాజిక సేవలు విస్తరిస్తాం


కల్వకుర్తిరూరల్: వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా సామాజిక సేవలను మరింత విస్తరిస్తామని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అడ్మినిస్ట్రేటర్ జూలూరి రమేష్ బాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని వాసవీకన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జిల్లా వైస్ గవర్నర్ కల్మిచర్ల రమేష్, కల్మిచర్ల గోపాల్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీధర్, వాసవీక్లబ్ అధ్యక్షుడు రాఘవేందర్, కార్యదర్శి కోటేశ్వర్, కోశాధికారి రవికుమార్, వనితక్లబ్ అధ్యక్షురాలు ధనలక్ష్మి, ఆంజనేయులు పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రంతో పాటు జనుంపల్లి గ్రామాల్లో పది మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం మండల మాజీ కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ కరీం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాబు, బాలరాజుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

కల్వకుర్తి టౌన్/ కల్వకుర్తి రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి శుక్రవారం న్యాయమూర్తి రెండు రోజుల జైలు, రూ.100 జరిమానా విధించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం పట్టణంలో రెండు రోజుల కిందట డ్రంకెన్‌డ్రైవ్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా ముగ్గురు పట్టుబడ్డారు. వారిలో మండలంలోని ముకురాల చెందిన తిరుపతయ్య, తర్నికల్‌కు చెందిన రామకృష్ణలు పట్టుబడగా, వీరిద్దరికి రెండు రోజుల జైలుశిక్షతో పాటుగా, రూ.100 జరిమానా, అదేవిధంగా మండలంలోని ఎల్లికల్‌కు చెందిన భూపాల్‌గౌడ్‌కు జడ్జి ఒక రోజు జైలుశిక్షతో పాటుగా, రూ.100 ల జరిమానా జడ్జి కావ్య విధించారు.

పశువులకు వైద్య పరీక్షలు



చారకొండ: పశుగణాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని శేరి అప్పారెడ్డిపల్లిలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు కృత్రిమ గర్భధారణ సాధారణ చికిత్స, గర్భకోశ వ్యాధి చికిత్సలను, నట్టల నివారణ, గాలికుంటు నివారణ టీకాలు పంపిణీ చేసి, ఉచితంగా మందులు అందజేసినట్లు పశువైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల పశువైద్య అధికారి శివకుమార్, ఉప్పునుంతల మండల వైద్య అధికారి ప్రవీణ్ కుమార్, వీఎల్ఓ మధర్, ఎల్ఎస్ఏ వెంకటేశ్వర్లు, శివరాం, సిబ్బంది తదితరులు ఉన్నారు.